# సంబరాలకు సిద్ధమైన వినాయక పందిళ్లు


ఖుద్దూస్‌నగర్‌లో కొలువుదీరిన గణనాథుడు


ప్రభాస్ కాలేజీ వద్ద అమ్మకానికి ఉంచిన గణేశుని ప్రతిమలు


మట్టి వినాయకుని ప్రతిమలను కొనుగోలు చేస్తున్న భక్తులు

- వాడ వాడలా భారీ విగ్రహాల ఏర్పాటు
- మిరుమిట్లుగొలిపే విధంగా విద్యుత్ దీపాల అలంకారాలతో మండపాల ఏర్పాట్లు

**పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ):** వినాయక చవితి వేడుకలకు వాడ వాడలా ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి. కేదారేశ్వరపేటలోని జీరో లైన్, ఒకటి, రెండు, మూడవ లైన్‌లలో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండపాలను విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో అందంగా అలంకరించి గణేషుని పూజకు సిద్ధం చేశారు. వివిధ రూపాల్లో ఉన్న గణేశుని విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తొమ్మిది రోజుల పాటు ఈ మండపాల్లో గణేశుడు భక్తులతో పూజలందుకోనున్నారు.

**మండుతున్న పూల ధరలు....**

నిన్నటి వరకు కేజీ రూ.150 నుంచి రూ.200 పలికిన బంతి, చామంతి, గులాబీలు మంగళవారం కేజీ రూ.500 నుంచి రూ.900 ధరకు చేరుకున్నాయి. అరటి, జామ, బత్తాయి, కమలా పండ్ల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

**పత్రి కొనుగోలుతో హడావుడిగా రహదారులు**

వినాయకునికి సమర్పించేందుకు పత్రి కొనుగోలు చేసే భక్తులతో కేదారేశ్వరపేట, పూర్ణానందంపేట, పెజ్జోనిపేట, ప్రభాస్ కాలేజీ రోడ్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కుటుంబ సమేతంగా భక్తులందరూ పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు రోడ్లపైకి రావటంతో ఆయా రోడ్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

**మట్టి వినాయకుని ప్రతిమల కొనుగోలుకు ఆసక్తి..**

అధికశాతం మంది భక్తులు మట్టి వినాయక ప్రతిమలను కొనుగోలు చేసేందుకు ఎక్కువగా ఆసక్తి కనపర్చారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలగటంతో ఎక్కువగా మట్టి వినాయక ప్రతిమల కొనుగోలుకు డిమాండ్ బాగా పెరిగింది.

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** నగరంలో వినాయక చవితి వేడుకలకు పందిళ్లు ముస్తాబయ్యాయి. కుల, మత, రాజకీయాలకు అతీతంగా చిన్న, పెద్ద తారతమ్యాలు లేకుండా వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే చవితి పందిళ్లను వేసి విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. మధురానగర్, ముత్యాలంపాడు, రామకృష్ణాపురం, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, మాచవరం, దుర్గాపురం, బావాజీపేట, సత్యనారాయణపురం తదితర ప్రాంతాలలో చవితి వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే కొన్నిచోట్ల విగ్రహాలను తీసుకువచ్చి పందిళ్లలో ఉంచారు.


గాంధీనగర్ మాజేటివారివీధిలో ఏర్పాటుచేసిన వినాయక పందిరిలో భారీ వినాయక విగ్రహం


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పూజా సామగ్రి

## మట్టి గణపతి విగ్రహాలు ఉచితంగా పంపిణీ


ముత్యాలంపాడులో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న బొండా ఉమా


మధురానగర్‌లో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న రాయల్స్ క్లబ్, స్త్రీశక్తి అధ్యక్షులు ఎ.అపర్ణ, కె భవాని


బీఆర్‌టీఎస్ రోడ్డులో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** మట్టి గణపతిని పూజించటంతో పాటు పర్యావరణ హితంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచించారు. విజయవాడ ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో మంగళవారం ముత్యాలంపాడులో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ప్రతి ఏటా వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు డి.మురళీకృష్ణంరాజును అభినందించారు. అనంతరం 1200 వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవనీతం సాంబశివరావు, డి.మురళీకృష్ణంరాజు నున్న శివనాగేశ్వరరావు, యు.కనకారావు, గుర్రం సుబ్బారావు, మన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**రాయల్స్ క్లబ్ స్త్రీశక్తి ఆధ్వర్యంలో...**

రాయల్స్ క్లబ్ స్త్రీశక్తి ఆధ్వర్యాన మధురానగర్, పసుపుతోటలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా క్లబ్‌ల అధ్యక్షులు ఎ.అపర్ణ, కె భవాని మట్టి గణపతిని పూజించాల్సిన ఆవశ్యకతను వివరించారు. పర్యావరణ హితంగా వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం 1500 మందికి మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.కృష్ణ, ఎ.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ**

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో పర్యావరణ హితమైన మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. సత్యనారాయణపురం బీఆర్‌టీఎస్ రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వంద మందికి పైగా విగ్రహాలను అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బాలగోపాల్, కార్యదర్శి రాంగోపాల్, సభ్యుడు బి.సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వినాయక నిమజ్జన ఏర్పాట్లు


కృష్ణానది వద్ద నిమజ్జన పాయింట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

**పటమట(విజయవాడతూర్పు):** వినాయక చతుర్థి అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమల నిమజ్జన ఏర్పాట్లు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జరగాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం సీతమ్మ వారి పాదాలు, వన్‌టౌన్, ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం, ఎం.జి రోడ్డు, ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని పెద్ద విగ్రహాలను సీతమ్మ వారి పాదాల వద్ద గతంలో నిమజ్జనం చేసిన ప్రాంతంలోనే చేయాలని, చిన్న విగ్రహాల కోసం ప్రత్యేకంగా ట్యాంకర్ ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. కాలువల వద్ద నిమజ్జనం చేసే ప్రజలకు కేవలం వినాయకుని ప్రతిమ మాత్రమే కాలువలో నిమజ్జనం చేయాలని, ఆకులు పూలను ప్రత్యేకమైన బిన్లలో వాటిని వేసి వీఎంసీ సిబ్బందికి సహకరించాలని అన్నారు. బిన్లలో వచ్చే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు నగరపాలక సంస్థ వారికి సహకరించి పెద్ద విగ్రహాలను నగరంలో ఎక్కడా నిమజ్జనం చేయకుండా కేవలం సీతమ్మ వారి పాదాల వద్ద వీఎంసీ ఏర్పాటు చేసిన పాయింట్లోనే నిమజ్జనం చేయాలని, చిన్న విగ్రహాలతో తీసుకొచ్చే పూల వ్యర్థాలను నగరపాలక సంస్థ వారికి అందించాలని కోరారు. ప్రజలందరూ పర్యావరణహితమైన వినాయకుడిని వాడి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీనివాసరెడ్డి, జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాస్, జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా పత్రి విక్రయాలు



**పాయకాపురం(విజయవాడరూరల్):** హిందువులు జరుపుకొనే అతి పెద్ద పండుగల్లో వినాయక చవితి ఒకటి. వినాయక పండుగ రోజున వినాయకుని పూజకు అతి ముఖ్యమైన పత్రిలను మంగళవారం పైపులరోడ్డు, ప్రకాష్‌నగర్, పాయకాపురం రైతుబజారు కండ్రిక ప్రధాన సెంటర్లలో రోడ్లపై విక్రయిస్తున్నారు. పాలవెల్లి, మామిడితోరణంకు మామిడిఆకులు, మారేడు, నేరేడు, వెలగ, ఉమ్మెత్త, మొక్కజొన్నపొత్తులు, జామకాయలు, దానిమ్మ ఇంకా పలు రకాల కాయలను విక్రయిస్తున్నారు. వాటిని కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు రావడంతో రోడ్ల పై విపరీతమైన రద్దీ కనిపించింది. నెక్కలం, సూరంపల్లి, ఆగిరిపల్లి, నూజివీడు, పరిసర ప్రాంతాల నుంచి వ్యాపారులు పూజకు ఉపయోగించే వాటిని తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. గత ఏడాది కంటే రద్దీ ఎక్కువగా కనిపించడం విశేషం.

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ప్రధాన రహదారులు కిటకిటలాడాయి. భక్తులు, మహిళలు పత్రి, పండ్లు పూలు కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో రావడంతో రోడ్లన్నీ రద్దీగా ఉన్నాయి. మధురానగర్, ముత్యాలంపాడు, మాచవరం, దుర్గాపురం, సత్యనారాయణపురం తదితర ప్రాంతాలలో రోడ్లపై చవితి పూజలకు అవసరమైన పత్రిని విక్రయించారు. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు పూజకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేశారు. పత్రిని సెట్ రూ.50, రూ.100కు విక్రయించారు. ఇక పండ్లు పూల ధరలకు రెక్కలు వచ్చాయి.



## ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** ఇతరులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వినాయక చవితి పందిర్ల వద్ద చవితి పండుగ వేడుకలను జరుపుకోవాలని ఏడీసీపీ జి.రామకృష్ణ చవితి పందిర్ల నిర్వాహకులకు సూచించారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక చవితి పందిర్లు వేస్తున్న నిర్వాహకులతో సింగ్‌నగర్ షాదీఖానాలో మంగళవారం పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రోడ్లపై పందిర్లు వేసినప్పుడు స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, ప్రధానంగా రాత్రుల సమయంలో పెద్ద పెద్ద సౌండ్స్, డీజేలు పెట్టి డ్యాన్సులు వేయడం, మద్యం తాగి గొడవలు, అల్లర్లకు పాల్పడడం మంచి పద్ధతి కాదన్నారు. ఇటువంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చవితి పందిర్ల వద్ద అవసరమైతే సీసీ కెమెరాలు కానీ, సెక్యూరిటీ గార్డ్‌లను గానీ ఏర్పాటుచేసుకోవడం మంచిదని సూచించారు. బొమ్మల ఊరేగింపును రాత్రి 10 గంటల సమయంలోపు పూర్తిచేసుకోవాలని, డీజేలు, తీన్‌మార్‌లకు ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సింగ్‌నగర్ సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు, స్టేషన్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## మార్గంమధ్యలో బస్సు ఆగకూడదు

**గేట్ మీటింగ్‌లో మెకానిక్‌లకు ఆర్‌ఎం దానం ఆదేశం**


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఆర్‌ఎం దానం

**ఆటోనగర్(విజయవాడతూర్పు):** బస్సులను ఎప్పటికప్పుడు కండీషన్‌గా ఉంచాలని, మార్గంమధ్యలో ఆగకుండా ప్రయాణికులకు ఇబ్బందిగా ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఆర్టీసీ ఆర్ఎం దానం సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆటోనగర్ ఆర్టీసీ డిపోలో సిబ్బందితో ఆయన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గో సేవలను డిపో మేనేజరు కె.ప్రవీణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిపోలో ఉన్న లగ్జరీ, మెట్రో ఏసీ బస్సుల కండీషన్ గురించి ఆయన ఆరా తీశారు. మెకానిక్‌లు పలు సమస్యలను ఆర్‌ఎం దృష్టికి తీసుకువచ్చారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, బస్సుల మరమ్మతులకు సంబంధించి అవసరమైన మెటీరియల్‌ను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. బస్సుల కండీషన్ లేకపోతే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా మెకానిక్‌ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓల్వా బస్సుల పనితీరును కూడా అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత డీఎంతో పాటు పలువురు సిబ్బందితో సమావేశమై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. సిబ్బంది, డ్రైవర్లు ఉన్నారు.

## మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసిన ఎస్‌ఆర్‌ఆర్ విద్యార్థులు


విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతి ప్రతిమలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** మన సంస్కృతి, సంప్రదాయాలతో పాటు పర్యావరణాన్ని కూడా పరిరక్షించుకోవాలని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రపంచ రికార్డు నెలకొల్పే క్రమంలో స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగం ఆధ్వర్యాన మంగళవారం విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తిని పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడేలా చేయటం అభినందనీయం అని కొనియాడారు. తమ కళాశాల విద్యార్థులు సైతం ప్రపంచ రికార్డు నెలకొల్పే కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. కళాశాల బోటనీ విభాగాధిపతి డాక్టర్ జి.స్వప్న మాట్లాడుతూ విగ్రహాల తయారీలతో తాము విత్తనాలు మట్టిలో కలిపి ఎటువంటి రసాయనాలు, రంగులు వినియోగించకుండా సహజమైన రంగులతో వినాయక ప్రతిమలను తయారు చేసి పంపిణీ చేస్తున్నామన్నారు. మట్టి ప్రతిమలను నిమజ్జనం చేసే క్రమంలో ఇందులోని విత్తనాలు మొలకెత్తి పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించేలా విద్యార్థులు చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సహజ సిద్ధంగా తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ నాగేశ్వరరావు, బోటనీ అధ్యాపకులు డాక్టర్ వీఎస్ పద్మావతి, డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరెడ్డి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నగర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**మల్లాది విష్ణు**

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** వినాయక చవితి వేడుకలను పర్యావరణ హితంగా ఘనంగా జరుపుకోవాలని, స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు మంగళవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. నగర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు పర్యావరణ హితంగా మట్టి గణపతినే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఆ గణనాథుడి ఆశీస్సులు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిపై ఉండాలని, ఆయనకు ఎటువంటి విఘ్నాలు లేకుండా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

### మదర్ థెరిస్సా స్ఫూర్తితో సేవ చేయాలి



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ప్రతి ఒక్కరూ మదర్ థెరిస్సా స్ఫూర్తితో నిస్వార్థంగా తోటివారికి సేవలు చేయాలని డాక్టర్ బ్రహ్మదేశం వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు బి.వసంతకుమార్, డెప్యూటీ గవర్నర్ గుర్రం ఏడుకొండలు అన్నారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టు గెదర్ కార్యాలయంలో మంగళవారం డాక్టర్ బ్రహ్మదేశం వాకర్స్‌క్లబ్, హెల్పింగ్ టు గెదర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా థెరిస్సా చిత్రపటానికి హెల్పింగ్ టు గెదర్, వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కోరంగి నాగమల్లీశ్వరి, ఎస్‌కే షఫీవుల్లా, హేమంతరావు, రహీమాలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

### కలిదిండి ఘటనకు కారకులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు**

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** ఇటీవల ఏలూరు జిల్లా కలిదిండిలో దివంగత ఎమ్మెల్యే, కాపునేత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పేడ పూసి అవమానపరచిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు డిమాండ్ చేశారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. తొలుత రంగా చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ రంగా విగ్రహానికి పేడ పూసి అవమానపరచడం సరికాదన్నారు. ఇటువంటి దుశ్చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ పరిశీలకుడు పోతిన మహేష్, చెన్నుపాటి శ్రీనివాస్, మా ఆర్ట్స్ అధినేత చంటి, అత్తులూరి జస్వంత్ కుమార్, ఆకుల శ్రీనివాస్ కుమార్, చలమల శెట్టి శ్రీనివాస్, ముళ్ళపూడి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్, టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి, రంగా అభిమానులు పాల్గొన్నారు.

### 29న పిన్నమనేని సిద్ధార్థలో వర్క్‌షాప్



**గన్నవరంరూరల్:** మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఈ నెల 29వ తేదీన డిపార్టుమెంట్ ఆఫ్ పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు కళాశాలలో మంగళవారం బ్రోచర్ ఆవిష్కరించారు. వర్క్‌షాప్ ఆన్ హెమోవిజిలెన్స్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా కార్యక్రమంలో వక్తలు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. స్టేట్ మెడికల్ కౌన్సిల్ భాగస్వామ్యంతో జరిగిన వర్క్‌షాప్‌లో ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ప్రొఫెసర్ నవీన్ చంద్రరావు, డాక్టర్ జాస్మిన్ సుల్తానా, ప్రొఫెసర్ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

### పంట కాల్వలో పడి మహిళ దుర్మరణం

**పాయకాపురం(విజయవాడరూరల్):** పాతపాడు గ్రామంలో పంట కాల్వలో మునిగి మహిళ మృతి చెందింది. ఈ సంఘటనపై నున్న పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు...వాంబే కాలనీలో నివసిస్తున్న గంజి వెంకటేశ్వర్లు, అతని భార్య నరసమ్మ పాతపాడు లోని పంట కాల్వలో దుస్తులు ఉతికేందుకు ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం వెళ్లారు. మద్యం తాగి ఉన్న నరసమ్మ దుస్తులు ఉతికే క్రమంలో కాల్వలో పడి మునిగిపోయింది. ఆమెను గ్రామస్తులు గమనించి ఒడ్డుకు తీసుకొచ్చి 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు పరీక్ష చేయగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలి భర్త వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### కలెక్టరేట్‌లో ఉచితంగ మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా వన్ ఎర్త్ వన్ లైఫ్ (టెర్రస్ గార్డెన్ గ్రూప్) వారు ఉచిత మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్ ఎర్త్ వన్ లైఫ్ సంస్థ పర్యావరణ పరిరక్షణ దిశగా చేస్తున్న సేవలను ప్రశంసించారు. సంస్థ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 520 మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసి, వాటిని సబ్ కలెక్టర్, కలెక్టర్ కార్యాలయంలో ఉచితంగా పంపిణీ చేసింది. కార్యక్రమంలో అడ్మిన్ లీలా కుమారి ఏలూరి, మద్దిరాల కమలాకరరావు, తిరునవల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

**ఐఓసీఎల్ ఔట్ లెట్‌లో...**

బందరు రోడ్డులోని ఐఓసీఎల్ పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో వినియోగదారులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. యజమాని ఎంవీవీ సత్యనారాయణ, మేనేజర్ వెంకటప్పయ్య వినియోగదారులకు పంపిణీ చేశారు.

### చవితి ఉత్సవాలకు మల్లాది విష్ణుకు ఆహ్వానం

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** వాంబే కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలకు మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి జి.హరేంద్ర, రబ్బానీ, నవీన్, చంటి తదితరులు మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణును మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఏటా వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను మల్లాది విష్ణు అభినందించారు.

### 31న యోగా పోటీలు

**మొగల్రాజపురం(విజయవాడతూర్పు):** యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఈ నెల 31వ తేదీ ఆదివారం నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో యోగా పోటీలను నిర్వహిస్తున్నామని కృష్ణా డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ స్థాయిలో బాల బాలికలకు, సీనియర్స్ పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు ఈ నెల 30వ తేదీ శనివారం ఉదయం 11 గంటలలోపు 94411 19909, 94402 76648 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా తెలియజేశారు.